ప్రజాశక్తి
సోమవారం 14 ఆగస్టు 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల






మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ రాహుల్

శాస్త్రీయ ఆలోచనతోనే

సమస్యలకు పరిష్కారం

జెవివి మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ రాహుల్

ప్రజాశక్తి-కనిగిరి, పిసిపల్లి

శాస్త్రీయ ఆలోచనతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ రాహుల్ అన్నారు. జన విజ్ఞానవేదిక ప్రకాశం జిల్లా 17వ మహాసభలు రెండోరోజు కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నరేంద్ర దబోల్కర్ ప్రాంగణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో రాజీవ్ రాహుల్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల మహాసభకు డిఎల్ ప్రసాద్ యు వెంకట్రావు, ఎస్కె ఖాజాహుస్సేన్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నివేదికను సిహెచ్.జయప్రకాష్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు భారతదేశంలో శాస్త్రీయ, సాంకేతిక రంగాలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయన్నారు. అనేక వ్యవస్థల్లో సూడో సైన్సు ప్రచారం విస్తతంగా జరుగుతుందన్నారు. దాన్ని ఎదుర్కోవటానికి హేతుబద్ధ ఆలోచనలను పెంపొందించేందుకు జెవివి ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో వారే నిజమైన సైన్సు అభివద్ధి కారుకులుగా మారతారన్నారు. శాస్త్రీయ ఆలోచన సమాజాభివద్ధికి దోహదపడుతుం దన్నారు. రెండో రోజు మహాసభల్లో జిల్లా ప్రధా న కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుబ్రహ్మణ్యం, పి.స్వరూపరెడ్డి, డాక్టర్ బి.హరిబాబు, కోశాధికారి బి.తిరుపతయ్య, సీనియర్ నాయకులు వి.మాలకొండారెడ్డి, మూలె బ్రహ్మారెడ్డి, షేక్ అక్బర్, నాయకులు ఎస్కెపిఎం గౌస్, బి.రుసేంద్ర కుమార్ పాల్గొన్నారు.

వార్డు ఎన్నికల్లో

రచ్చకెక్కిన రాజకీయం

- వైసిపిలోని రెండు గ్రూపులు, టిడిపి, జనసేన మధ్య ముదిరిన గొడవ
- 'రామన్నపేట' ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించిన రాజకీయ పార్టీల నేతలు


ఘర్షణ పడుతున్న రెండు గ్రూపులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేటపాలెం మండలం, రామన్నపేట పంచాయతీలో రెండు వార్డులకు జరుగుతున్న ఉప ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం నామినేషన్ల ఆఖరి రోజున వైసిపిలోని కరణం బలరాం గ్రూపు, ఆమంచి కృష్ణమోహన్ గ్రూపుల మధ్య నెలకొన్న వివాదం పరస్పర దాడులకు దారితీసింది. చీరాల నియోజకవర్గం మొత్తం మీద పంచాయతీ ఎన్నికలు రెండేళ్ల క్రితం జరిగింది ఒక్క రామన్నపేటలోనే. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కూడా ఇక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రామన్నపేట సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. అయినప్పటికీ పోలీసు యంత్రాంగం నామినేషన్ల సందర్భంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకున్న పరిస్థితి లేదు. నామినేషన్లతో సంబంధం లేని వారిని బయటనే నిలువరించిన దాఖలాలు లేవు. దీంతో వైసిపిలోని రెండు గ్రూపుల వారు నామినేషన్ల కార్యక్రమంలోకి జొరబడిన కారణంగానే వివాదం మొదలయి పరస్పర దాడులకు దారితీశాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వైసిపిలోని రెండు గ్రూపుల వారు రహదారిపై చేరకుండా ▶ 2లో

ఆ సామాజికవర్గానికి ఆమంచి క్షమాపణ

ప్రజాశక్తి-చీరాల

కమ్మ సామాజికవర్గాన్ని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్ క్షమాపణ కోరారు. ఆదివారం ఆయన వాట్సాప్ వీడియో ద్వారా తన క్షమాపణను తెలిపారు. కులాన్ని ఉద్దేశించి తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10న రామన్నపేట వార్డుమెంబర్ల ఉప ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలో అనుకోని రీతిగా పొరపాటున మాట్లాడానని అన్నారు. కమ్మ సామాజిక వర్గంలో అనేకమంది మిత్రులు, శ్రేయోభిలాషులు ఉన్నారని చెప్పారు. ఘర్షణలో పొరపాటున దూషించానని, అందుకు తనను క్షమించాలి కోరారు. అయితే తన క్షమాపణ రామన్నపేట ఘటనకు కారకులైన వారికి మాత్రం వర్తించదని స్పష్టం చేశారు.

ట్రాక్టర్ బోల్తా..ఇద్దరు మృతి..

- కొలుపులకు వెళ్లి వస్తుండగా ఘటన
- మృతుల్లో నాలుగు సంవత్సరాల బాలుడు


బోల్తా పడిన ట్రాక్టర్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

అమ్మవారి కొలుపులకు వెళ్లి వస్తూ.. ద్విచక్రవాహనాలను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని కుంచాలవారిపాలెం గ్రామ సరిహద్దులలో జరిగింది.

చుండూరు గ్రామానికి చెందిన 11 మంది భక్తులు ఏపీ 39 టిఎన్ 2622 నెంబర్ గల ట్రాక్టర్లో ఆదివారం కర్లపాలెం మండలం, యాజలి గ్రామంలో జరిగిన అమ్మవారి కొలుపులలో పాల్గొని ఉత్సాహంగా ఇంటికి తిరిగి వెళుతున్నారు. ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను తప్పించబోయి ట్రాక్టర్ పక్కనే ఉన్న నిజాంపట్నం కాలువలో బోల్తా పడింది. ట్రాక్టర్లోని ప్రయాణికులు కాలువలో పడిపోయారు. వీరిలో చుండూరు గ్రామానికి చెందిన సుదర్శనం ప్రసాద్(60), గుంటూరు రిత్విక్ షణ్ముఖ (4) అక్కడికక్కడే మతి చెందారు. మరో ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


మృతిచెందిన ప్రసాద్

సిఐ సహాయక చర్యలు

ప్రమాదం జరిగిన సమయంలో రేపల్లె రూరల్ సిఐ ఎ.శివశంకర్ గుంటూరు వైపు నుండి సంఘటన జరిగిన వైపు వస్తుండగా వెంటనే చూసిన సిఐ హుటాహుటిన స్థానికులను అప్రమత్తం చేశారు. బోల్తా పడిన ట్రాక్టర్ను సరిచేసి పలువురి ప్రాణాలను కాపాడారు. సిఐని స్థానికులు అభినందించారు. సంఘటనా స్థలాన్ని బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, రేపల్లె డీఎస్పీ మురళీకష్ణ పరిశీలించారు.


మృతిచెందిన శివ

స్నేహితుడిని కాపాడాలని వెళ్లి..

సముద్రంలో పడి యువకుడు మృతి

3లో ▶

వార్డు ఎన్నికల్లో రచ్చకెక్కిన రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు గంటల పాటు తాత్సారం చేశారు. పోలీసు యంత్రాంగం అధికార పార్టీ నేతలను నిలువరించలేని నిస్సహాయస్థితి కారణంగా వివాదం పెరిగి ఘర్షణలను దారితీసింది. ఒక పంచాయతీలో రెండు వార్డులకు జరుగుతున్న ఎన్నికను వైసిపిలోని రెండు గ్రూపుల వారు ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న కారణంగా నియోజకవర్గంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి తోడు వార్డు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్ల పరిశీలనలో వైసిపిలోని ఒక గ్రూపువి, టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నామినేషన్లను సక్రమంగా లేవంటూ తిరస్క రించడం జరిగింది. ఇందుకు రామన్నపేట వెళ్లి నిరసన తెలిపిన టిడిపి చీరాల ఇన్‌ఛార్జిని ఎంఎం కొండయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్ళి తరువాత వదిలిపెట్టారు. ఈ సందర్భంగా కొండయ్య చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, వైసిపి చీరాల ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌లను దూషించడంతో కరణం గ్రూపు వారు విలేఖరుల సమావేశం పెట్టి కొండయ్య తీరును దుయ్యబట్టారు. ఈ ఎన్ని కల్లో జనసేన అభ్యర్థి నామినేషన్ కూడా తిరస్కరణకు గురవడంతో ఇటీవలనే జనసేనలో చేరిన ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు) పరుష పద జాలంతో కరణం వెంకటేష్‌ను దూషించడంతో రెచ్చ గొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పెట్టారన్న కారణంగా ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజకీయంగా ఎవరికి వారుగా వేరుగా ఉంటున్న ఆమంచి సోదరులు రామన్నపేట ఘటనల కారణంగా ఉమ్మడి శత్రువును ఎదుర్కొనే విషయంలో ఒక్కటయ్యారన్న ప్రచారం జరిగింది. తమ్ముడికి అన్న స్వాములు వత్తాసు పలికి తమపైకి ఎవరైనా దాడికి వస్తే కలిసి పోరాడతామన్న సంకేతాలిచ్చారు.

రామన్నపేట ఘటనల నేపథ్యంలో ఆమంచి కృష్ణమోహన్ ఓ సామాజిక వర్గాన్ని దూషించడం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కలకలం రేపింది. ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న ఈ వర్గీయులు ఈ వాఖ్యలపై తమ నిరసన తెలుపుతున్నారు. కరణం, ఆమంచి గ్రూపుల మధ్య గొడవలు ఉంటే చీరాలలో చూసుకోవాలి తప్ప తమను దూషించడం ఏమిటనేది వారి వాదనగా ఉంది. పర్చూరులో ఉన్న 96 పంచాయతీల్లో 64 పంచాయతీల్లో ఆ సామాజి కవర్గం వారే ఎన్నికల్లో ముందుండి పనిచేస్తారని, తమను ఇలా దూషించడం ఏమిటని వారు ఆమంచిని ప్రశ్ని స్తున్నారు. తన వాఖ్యలు పర్చూరులో రాజకీయంగా నష్ట దాయకం కావడంతో ఆమంచి ఆ సామాజిక వర్గీయులకు క్షమాపణలు చెప్పారు. తాను రామన్నపేట ఘటనకు కారకులైన వారిపై మాత్రమే వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. రామన్నపేట ఉప ఎన్నికల్లో జరిగిన గొడవలపై పోలీసులు తగిన చర్యలకు పూనుకున్నారు. కేసులు నమోదు చేశారు. ఈ ఘటనల్లో ఆమంచి గన్‌మెన్ పోలీస్ సర్వీస్ రూల్స్‌ను ధిక్కరించినట్లు తమ విచారణలో తేలడంతో ఆయనపై చర్యలు తీసుకోనున్నారు. ఉద్రిక్తతలు చల్లారిన తరువాత పోలీసుల తదుపరి చర్యలుంటాయని తెలుస్తోంది.

తాడేపల్లికి చేరిన చీరాల, పర్చూరు పంచాయితీ

రామన్నపేట వార్డు ఎన్నికల నేపథ్యంలో కరణం, ఆమంచి వర్గీయుల మధ్య నెలకొన్న వివాదం తదనంతర పరిణామాలు అన్నీ వివిధ నివేదికల రూపంలో వైసిపి అధిష్టానం దృష్టికి చేరాయి. వార్డు ఉప ఎన్నికల్లో చనిపోయిన వారి స్థానంలో వారి బంధువులతో చర్చించి కుటుంబసభ్యులనే ఎన్నికల బరిలో దించినట్లు ఆమంచి గ్రూపు ప్రమేయం కాణంగానే ఇంత రగడ జరిగిందనేది కరణం గ్రూపు వాదనగా ఉంది. పర్చూరులో పార్టీ ఇచ్చిన భాధ్యతలను వదిలి చీరాల నియోజకవర్గ రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్న కారణంగానే గొడవలు జరుగు తున్నాయని ఇటు చీరాల, అటు పర్చూరు వైసిపి నేతల అభిప్రాయంగా ఉంది. ఈ మేరకు పర్చూరు నుంచి వైసిపిలో ఉన్న ఓ సామాజికవర్గం వారు పార్టీ అధినేతను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి, వేటపాలెం ఎస్‌ఐలపై ఆరోపణలు చేసిన ఆమంచి కృష్ణమోహన్ కూడా పార్టీ అధినేతను కలిసి జరిగిన ఘటనలపై ఫిర్యాదు చేస్తానని చెప్పారు. చీరాల, పర్చూరు వైసిపిలో ఏమి జరుగుతుంది అనేది సవివరమైన ఆధారాలతో కూడిన నివేదిక పార్టీ అధిష్టానం వద్ద ఉన్నప్పటికి సాచివేత వైఖరి కారణంగానే రెండు నియోజకవర్గాల్లో వైసిపి క్యాడర్ అభద్రతాభావంలో ఉండిపోవలసి వస్తుందని చెబుతున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయం : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఐదో డివిజన్ పరిధిలోని గోపాలనగర్ గడ్డికయ్యల గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల తెలిపిన సమస్యలను పరిష్కరించాలని స్థానిక అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా. .? లేదా..? అని పలువురిని ప్రశ్నించారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతున్నట్లు బాలినేని శ్రీనివాసరెడ్డి ఈసందర్భంగా పేర్కొన్నారు. తొలుత బాలినేనికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ ఎందేటి పద్మావతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భైరవకోనలో..

జడ్జి దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

భైరవకోన పుణ్యక్షేత్రాన్ని దర్శి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జివిఎల్. సరస్వతి, సుబ్బారావు దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా భైరవేశ్వర స్వామి ,త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు, నగరేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత జడ్జి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతంర అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దేవస్థానం శేష వస్త్రాలతో జడ్జి దంపతులను సన్మానించి తీర్థప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సిద్దు రమణారెడ్డి, అర్చక బందం, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జడ్జి దంపతులు

చిరంజీవి,పవన్‌పై విమర్శలు తగవు

గిద్దలూరు రూరల్ : సినీ హీరో చిరంజీవి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై కొందరు వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని ఎపి కాపు జెఎసి పొలిటికల్ ఛైర్మన్, గిద్దలూరు బలిజ సేవా సంఘం గౌరవ సలహాదారుడు దుత్త బాల ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక బలిజ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఆయన మాట్లా డారు. సినీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న అనేక మందికి చిరంజీవి చేయూత నందించినట్లు తెలిపారు. బ్లడ్ ,ఐబ్యాంకుల ద్వారా ప్రజలకు సేవ లందించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు పవణ్ కళ్యాణ్ రూ. 30 కోట్ల రూపాయల ఆర్థికసాయాన్ని అందించినట్లు తెలిపారు. ప్రజలకు సేవలు అందిస్తున్న చిరంజీవి, పవన్ కళ్యాణ్‌ల పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితువు పలికారు.

కొండపిలో 'చదవడం మాకిష్ణం'

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలు చదువుకొని విజ్ఞానవంతులు కావాలని గ్రంథపాలకుడు కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు సెలవు రోజులలో గ్రంథాలయానికి వచ్చిన విలువైన పుస్తకాలు చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఎన్నిక



మండ్లా శ్రీనివాస్



సిహెచ్ జయప్రకాష్



బి తిరుపతయ్య

కనిగిరి : జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా జిల్లా గౌరవా ధ్యక్షులుగా డాక్టర్ బి. జవహర్, డాక్టర్ బి. హరిబాబు డాక్టర్ టి.చెన్న కష్ణ ఎన్నికయ్యారు. అధ్య క్షుడిగా మండ్ల శ్రీనివాసులు ప్రధాన కార్య దర్శిగా సిహెచ్ .జయప్రకాష్ కోశా ధికారిగా ,బి.తిరుపతయ్య, ఉపా ధ్యక్షులుగా కె. నారాయణ డి. గురుస్వామి, షేక్ ఖాజా హుస్సేన్, యు వెంకట్రావు, నల్లూరి వెంకటేశ్వరరావు, డిఎల్. ప్రసాద్‌చ, కార్య దర్శులుగా కందుల రవిచ, ఎస్‌ఎండి.రఫీ,. విశ్వరూపచారి,శ్రీనివాసరెడ్డి, ఎన్‌టి. వెంకటేష్, యు.భాస్కర్ ఎన్నికయ్యారు. వైద్య ఆరోగ్య కన్వీనర్‌గా బి.శరత్, సమతా మహిళా కన్వీనర్‌గా షేక్ బషీరు ఉన్నీసా బేగం, సాంస్కృత విభాగంగా కన్వీనర్‌గా జెడ్. రమ ణయ్య, యూత్ కన్వీనర్‌గా జయ శేఖర్, మరో 26 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

చోరీల నియంత్రణకు సహకరించాలి : ఎస్‌ఐ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గ్రామాల్లో చోరీల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని గిద్దలూరు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఇటీవల కాలంలో వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు. శాంతి భద్రల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు.



ముగిసిన పీర్ల ఉత్సవాలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని డిజిపేట గ్రామంలో పీర్ల ఉత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొహరం వేడుకల్లో భాగంగా డిజి పేటలో ఈనెల 10 నుంచి పీర్ల ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం వేకువ జామున పీర్లను ఎత్తున నిప్పుల గుండం తొక్కారు. అనంతరం గ్రామంలో పీర్లను ఊరేగించారు. మేళ తాళాలతో పీర్లను ఊరేగిస్తూ పెద్దఎత్తున బాణా సంచా కాల్చారు. యువకులు డ్యాన్స్‌లతో సందడి చేశారు. స్థానికులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు విచ్చేసి ఈ వేడుకలను తిలకించారు.



వీధుల్లో పీర్ల ఉరేగింపు

గ్రామాల్లో 'నాభూమి- నాదేశం'

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని కండ్లగుంట, మద్దిరాలపాడు, చీర్వానుప్పలపాడు, చేకూరపాడు గ్రామాల్లో డూమా ఆద్వర్యంలో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అ సందర్భంగా వసుదైక వందనం, వీరలకు వందనం స్థూపాన్ని ఏర్పాటు చేసి మట్టికి వందనం చేశారు. అనంతరం దేశ ఔన్నత్యాన్ని చాటుతూ ప్రతిజ్ఞ చేసి జాతీయ జెండాను ఆవిష్క రించారు.దేశఐక్యతను చాటుతూ ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ కష్ణారెడ్డి దంపతులు, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పల్లెర్ల అంజిరెడ్డి, స్వర్ణ అనురాధ, మేడికొండ చెన్నమ్మ, రమేష్ ఎంపిటిసి రత్తయ్య, ఎంపిడిఒ జయమణి, నలమలపు కష్ణారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, బాలకష్ణ, ఎపిఒ రవిబాబు, టెక్నీకల్ అసిస్టెంట్ పిచ్చయ్య పాల్గొన్నారు.

418 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేత : ఎఇ

ప్రజాశక్తి-కొండపి



మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని రైతులకు 418 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసినట్లు విద్యుత్ ఎఇ కుంచాలకోటయ్య తెలిపారు. ప్రజాశక్తితో ఎఇ ఆదివారం మాట్లాడారు. తాను కొండపి మండల ఎఇగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2020-21లో 40, 2021-22లో 72, 2022-23 112 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెచ్‌విడిఎస్ ట్రాన్స్‌ఫార్మర్లు 194 మొత్తం 418 రైతులకు అందజేసినట్లు తెలిపారు. హెచ్‌విడిఎస్ ట్రాన్‌ఫార్మర్లు కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం, కట్టావారిపాలెం, కొండపి, పెరిదేపి, అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, నెన్నూరుపాడు, గుర్రపడియ, మూగ చింతల, ముక్కొడిపాలెం, పోలిరెడ్డిపాలెం, చినకల్లగుంట, గ్రామాల రైతులకు అందజేసినట్లు తెలిపారు.

దళితుల సమస్యల పరిష్కారంలో..

చిత్తశుద్ధి లేని పాలకులు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కనిగిరి / పిసిపల్లి

దళితుల సమస్యలు పరిష్కరించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే దళితులను చూస్తున్నారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాల ఆధ్వర్యంలో కనిగిరి సుందరయ్య భవనంలో కెవిపిఎస్ నాయకులు కత్తి యోబు అధ్యక్షతన '77 ఏళ్ల స్వాతంత్ర్యం - దళితుల అభివృద్ధి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గోచిపాతల రవికుమార్ మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి సల్పాల్సిన అవసరం ఉందన్నారు. దాడులు, హత్యలు, హత్యాచారాలు నేటికీ కొనసాగటం సిగ్గుచేటని అన్నారు. దళిత హక్కుల వేదిక నాయకులు గోన దానయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ సక్రమంగా అమలు జరగటం లేదని, నిధులు మొత్తం నవరత్నాలకు మళ్లించారని, దళితుల అభివృద్ధికి ప్రభుత్వం మోకాలు అడ్డుతోందని అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కూడలి దశరథ, కటికల అగస్టీన్ మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ ప్రమాదాన్ని అడ్డుకోవడంలో రాష్ట్ర పాలకులు వైఫల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు రాయల మాలకొండయ్య



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

మాట్లాడుతూ దళిత ఉద్యోగ కార్మికులకు రక్షణ కరువైందన్నారు. డివైఎఫ్ఐ నాయకులు కెసి రామయ్య, పగడాల చక్రి మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. దళిత యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక, సామాజిక అసమానతల నుంచి ప్రభుత్వం రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే ఖాదర్‌వలి మాట్లాడుతూ దళిత గిరిజన మైనార్టీలపై బిజెపి వాటి అనుబంధ సంస్థల దాడులు పెరిగాయని, కేంద్రంలో బిజెపి చేసే దుర్మార్గాలకు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అండగా నిలబడటం సిగ్గుచేటని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి చట్టాన్ని రద్దు చేయాలని, ఎస్సీ ఎస్టీలపై దాడులు, హత్యలు, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాల కేసులను విచారించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి దళిత ప్రజా సంఘాలకు కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. వివక్ష, అంటరానితనంపై ప్రభుత్వమే ప్రచార క్యాంపియన్ నిర్వహించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, మతోన్మాద బీజేపీ మనువాద శక్తులు రాజ్యాంగంపై చేస్తున్న దాడులను తిప్పి కొట్టాలని కోరారు. దారి మళ్లించిన ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను తిరిగి కేటాయించి దళితపేటలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి దళితునికి 3సెంట్ల ఇంటి స్థలం, 3 ఎకరాల వ్యవసాయ భూమి, పక్కా గృహం నిర్మాణ వ్యయం రూ.5 లక్షలకు పెంచి ఇవ్వాలని అన్నారు. కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, దళిత గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, దళిత ఉద్యోగులు కుడారి రామ్మోహన్, ప్రసాదు, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడిన దంపతులు

బైకును ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు



జాతీయ రహదారి 216లో ఓలేరు, పేటేరు గ్రామాల మధ్య వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కొల్లూరు మండలం కిష్కిందపాలేనికి చెందిన గుంటూరు వెంకటేశ్వరరావు, భార్య స్వర్ణకుమారి, కుమారుడు అఖిల్ ద్విచక్ర వాహనంపై ఓలేరు మీదుగా రేపల్లె వెళుతున్నారు. పేటేరు సమీపంలో 216 జాతీయ



గాయపడిన బాలుడు అఖిల్


రహదారిని దాటుతుండగా భట్టిప్రోలు వైపు నుంచి పెనుమూడి వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా వారిని రేపల్లె వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి తెనాలి వైద్యశాలకు రెఫర్ చేశారు. వెంకటేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు.

స్నేహితుడిని కాపాడాలని వెళ్లి..

సముద్రంలో మునిగి యువకుడు మృతి

ప్రజాశక్తి-చీరాల

వారందరూ స్నేహితులు. సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చారు. అప్పటివరకు తమతో ఉన్న స్నేహితుడు సముద్రంలో కళ్లముందే గల్లంతవుతున్న దృశ్యాన్ని చూసి ఈత రాకపోయినప్పటికీ కాపాడదామని వెళ్లి సముద్రంలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రామాపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కొందరు స్నేహితులు ఆదివారం సముద్రస్నానానికి రామాపురం వచ్చారు. అందరూ కలిసి మునుగుతుండగా అందులో ఒక వ్యక్తి లోతుకు వెళ్లిపోవటంతో అతన్ని కాపాడదామనే ఉద్దేశంతో రామిశెట్టి శివ(34) ప్రయత్నించగా ఈత రాకపోవటంతో గల్లంతయ్యాడు. అనంతరం శివను, అంతకుముందు మునిగిన వ్యక్తిని తోటి స్నేహితులు, మెరైన్ పోలీసులు కలసి అతికష్టంపై ఒడ్డుకు తీసుకొచ్చారు. వెంటనే



మునిగిపోతున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి శివ మృతిచెందినట్లు చెప్పారు. నరసరావుపేటకు చెందిన శివ, కోటేశ్వరి దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. ఆదివారం కావటంతో స్నేహితులందరూ కలసి సరదాగా గడిపేందుకు సముద్రానికి రాగా స్నేహితుడు మృత్యువాత పడటంతో అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచారు. ఈ మేరకు పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు.

శభాష్ శంకర్..

మానవత్వం చాటుకున్న ఆర్‌టిసి కండక్టర్

ప్రజాశక్తి-రాచర్ల

ఆర్‌టిసి గిద్దలూరు డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న రాచర్లకు చెందిన శంకర్‌నాయుడు మానవత్వం చాటుకున్నారు. ఆదివారం విధి నిర్వహణలో ఉండగా కంభం బస్టాండ్‌లో చినమన గుండంకు చెందిన మర్రి సుబ్బయ్య అనే వ్యక్తి కళ్లు తిరిగి కింద పడిపోయాడు. చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం కాగా గమనించిన కండక్టర్ శంకర్ నాయుడు వెంటనే స్పందించి కిందపడ్డ ఆ వ్యక్తిని లేపి కూర్చోబెట్టి నీళ్లు తాగించాడు. రక్తంస్రావం అవుతున్నచోట కట్టుకట్టి ప్రథమ చికిత్స చేశాడు. 108 వాహనానికి ఫోన్ చేసి హాస్పిటల్‌కు తరలించాడు. ఆసుపత్రిలో చికిత్సలు చేసిన వైద్యులు బాధిత వ్యక్తి సుబ్బయ్యకు ప్రాణాపాయం లేదని తెలిపారు. ఎవరేమైపోతే నాకెందుకులే అనుకునే నేటి సమాజంలో తోటి మనిషికి సాయం చేసి అతడి ప్రాణాలు కాపాడిన కండక్టర్ శంకర్‌ను, తోటి ఉద్యోగులు, ఆర్టీసి అధికారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.



బాధితుడికి ప్రాథమిక చికిత్స చేస్తున్న శంకర్ (ఇన్‌సెట్‌లో) శంకర్ (ఫైల్)

వైద్య, ఆరోగ్య ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వెంకటేశ్వర్లు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైద్య, ఆరోగ్య ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని యునైటెడ్ మెడికల్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తాళ్లూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 18న ఫీల్డ్ ఉద్యోగులు నిరసన తెలిపి జిల్లా అధికారులకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జీవో 32 ప్రకారం పిహెచ్‌సిలలో 14 క్యాడర్లే ఉండాలని ఉద్యోగులను సర్దుబాటు చేస్తున్నారని, వారికి భవిష్యత్తులో జీతాల సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. జీతాల సమస్య రాకుండా ముందుగానే చర్యలు చేపట్టి, ఆ తరువాత రేషనలైజేషన్ ప్రక్రియని చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ అప్పట్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఈ ప్రక్రియ 60 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఎన్నికల సమయంలో సిఎం హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం కూడా వైద్య ఆరోగ్య శాఖలో రెగ్యులర్ నియామకాలనే చేపట్టాల్సి ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్య ఉద్యోగులను రెగ్యులర్ చేయడం మంచి పరిణామమని, వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు సురేష్, స్మిత, శారద పాల్గొన్నారు.

రెండు ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులు

ప్రజాశక్తి-చీరాల

సముద్ర తీరంలో గల్లంతవుతున్న ఇద్దరు యువకులను మెరైన్ పోలీసులు సకాలంలో స్పందించి రెండు ప్రాణాలను కాపాడారు. రామాపురం తీరంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు తీరంలో ఇద్దరు యువకులు లోతుకు వెళ్లి గల్లంతవుతున్నట్లు గుర్తించి వెంటనే సముద్రంలోకి వెళ్లి అతికష్టంపై యువకులను బయటికి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాలల్లోకి వెళితే.. ఆదివారం వాడరేవు, రామాపురం తీరంలో పర్యాటకులు సముద్ర స్నానానికి వచ్చారు. ఈ క్రమంలో రామాపురంలోని ఓ రిసార్టు సమీపంలో కొందరు వ్యక్తులు సముద్రంలో మునుగుతున్నారు. ఈ సమయంలో అలల తాకిడికి కర్నూలుకు చెందిన పుల్లేటి మహేష్, గోగుల రమణ అనే ఇద్దరు వ్యక్తులు సముద్రస్నానం చేస్తుండగా అలల తాకిడికి ఇద్దరూ మునిగిపోతుండగా కేకలు వేయటంతో సమీపాన ఉన్న మెరైన్ కానిస్టేబుల్స్ ఎస్ గణేష్, ఎం వెంకటేశ్వర్లు తక్షణమే అక్కడికి చేరుకుని వారికి సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చి సపర్యలు చేసి తోటి స్నేహితులకు అప్పగించారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ శ్రీనివాసరావుతోపాటు ఎస్ఐ పి సుబ్బారావు సిబ్బందిని అభినందించారు. సముద్రతీరానికి వచ్చే పర్యాటకులు మద్యం సేవించరాదని, ఎక్కువ లోతుకు వెళ్లకుండా తగిన జాగత్తలు తీసుకోవాలని అన్నారు. సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపట్నం మెరైన్ సీఐ కె శ్రీనివాసరావు సూచించారు.

జనసేనలో కుమ్ములాట

దాడులకు దిగడంతో పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలో జనసేన కార్యకర్తల మధ్య, నాయకుల మధ్య కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీన జనసేన పార్టీకి చెందిన కార్యకర్త తోట అంజి సోషల్ మీడియా గ్రూపులో చిరంజీవి జన్మదినానికి సంబంధించిన పోస్ట్ ఉంచడంతో ఆ విషయంపై పార్టీలోని నాయకులు ఏకపక్ష నిర్ణయంతో పోస్టులు పంపడమేంటని మండల పార్టీ మాట్లాడుకుని నిర్ణయం తీసుకోవాల్సిఉందని సూచించడంతో ఆ విషయంపై తోట అంజి మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కొంజేటి ధనుష్ ఇరువురు మధ్య వివాదం మొదలైంది. మరుసటి రోజు నాగులుప్పలపాడులో రెండు వర్గాలు మాట్లాడుకుందామని సమావేశమై ఒక్కసారిగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దాంతో కొంజేటి ధనుష్ ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరి తోట అంజి అతని వర్గీయులపై పోలీసు ఔట్ పోస్ట్‌లో ఫిర్యాదు చేశారు. నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్లో కొంజేటి ధనుష్ వర్గీయులపై తోట అంజి అతని వర్గీయులు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇరువర్గాల పోరు కొనసాగుతోంది. తాజాగా ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో నాగులుప్పలపాడు నాయకుల మధ్య వివాదం సద్దుమణిగించేందుకు జిల్లా అధ్యక్షులు రియాజ్ అక్కడకు పిలిపించి మాట్లాడేందుకు ప్రయత్నించగా మరోసారి వివాదం చెలరేగి మండల పార్టీ అధ్యక్షులు భూపతి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరరావు వర్గీయులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా ఆ గొడవలో పెంట్యాల కోటేశ్వరావు చొక్కా చిరిగిపోయింది. ఇరు వర్గాలకు సయోధ్య కుదిరించేందుకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని తమ ఇరువర్గాలతో మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాలు సయోధ్యకు ససేమిరా అంటూ ఎవరి దారిన వారు వెళ్లారు. పదో తేదీన జరిగిన గొడవపై ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉయ్యాల హరిబాబు తెలిపారు.

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసులలో మెజారిటీగా ఉన్న క్రైస్తవుల ఇండ్లపై, చర్చిలపై దాడులు చేసిన బిజెపి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్‌లో ఆదివారం కెవిన్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఆదివాసీలకు సంఘీభావం ప్రకటించారు. మణిపూర్ మృతులకు నివాళు లర్పించారు. క్రైస్తవ ఐక్యత వర్ధిల్లాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కెవిన్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జువ్విగుంట శ్రీనివాసరావు అధ్యక్షతన బహిరంగ సభలో వక్తలు మాట్లాడ్లారు. మణిపూర్‌ను ప్రయోగశాలగా ఎంచుకున్న ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్ల కుంపటి రగిలించిందని అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. అక్కడి హైకోర్టు నిర్ణయాన్ని నిరసిస్తూ మే 3న ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ మణిపూర్ రాజధాని ఇంపాల్‌లో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేశారని అన్నారు. పోలీస్ స్టేషన్ల మీద దాడులు చేసి 3500తుపాకులు, ఐదు లక్షల తూటాలు ఎత్తుకెళ్లారన్నారని అన్నారు. అక్కడ హైకోర్టు పెట్టిన చిచ్చుకి సర్కారు ఆజ్యం పోస్తున్న కారణంగా మణిపూర్ మండుతూనే ఉందన్నారు. రానున్న ఎన్నికలలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిన్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె కృష్ణ, జిల్లా అధ్యక్షులు ఓ శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ప్రగతిశీల కార్మిక సమైక్య నాయకులు కొండలు, పాస్టర్స్ సంఘాల నాయకులు కిష్టాపర్, సువర్ణ రాజు, సుబ్బారావు, బొంతా స్వర్ణరాజు, సుబ్బారావు, యానాదిరెడ్డి, జాషువా, విశాఖు పాల్గొన్నారు.



మణిపూర్ ఘటనలపై ర్యాలీ చేస్తున్న క్రైస్తవ, మైనారిటీలు


నూతన జెవివి బాపట్ల జిల్లా కమిటి సభ్యులు

జెవివి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

జన విజ్ఞాన వేదిక 17వ జిల్లా మహాసభ బంగాళా రోడ్డు చిన్ని శాంతయ్య సేవా సదంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జెవివి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షు లు వై హనుమంతరావు, డాక్టర్ జి సుబ్బా రావు, టి ప్రసాదరావు, గౌరవ సలహాదారు ఎం సర్వేశ్వరరావు, ధ్యక్షులు వై భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాసరావు, కోశాధికారి బి పిచ్చియ్య, ఉపాధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి, కె ప్రభుదాసు, ఎం త్రిమూర్తులు, పి కృష్ణారావు, పి కోటిలింగాచారి, కార్యదర్శిలు ఎస్‌కెఎం సుభాని, కె మాల్యాద్రి, ఎన్ కళాధర్, కె పోతురాజు, బి సుధాకరరావు, సన్నాహక కన్వీనర్ కె కుసుమకుమారి, సాంస్కృతిక కన్వీనర్ యు దక్షిణామూర్తి, సహకమిటి కన్వీనర్ కె రఘుచందు ఎంపికయ్యారు.



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

జాతీయ జెండాలతో ర్యాలీ

ప్రజాశక్తి - చీరాల

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ ప్రతినిధులు, వాకింగ్ సభ్యులు, పాఠశాల విద్యార్థులతో పట్టణంలో జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, బండారుపల్లి హేమంత్కుమార్ మాట్లాడారు. సేవా, స్నేహం పెంపొందించుకునేందుకు రోటరీ, క్లబ్‌లో చేరాలని కోరారు. పోలియో మహమ్మారిని ప్రపంచంలోనే తరిమికొట్టింది రోటరీ అని అన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రపంచ వ్యాప్తంగా అనేక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. ప్రజల జీవనోపాధి కోసం కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు, నీటిబోర్లు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు రోటరీ ఎంతగానో దోహదపడు తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఐ బాబూరావు, డాక్టర్ వి అమృతపాణి, గుర్రం రాఘవరావు, డీవీ సురేష్ పాల్గొన్నారు.


టిడిపి మేనిఫెస్టో మహాశక్తి ప్రచారం చేస్తున్న మహిళలు

మహిళల జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపి ఇంచార్జ్ వేగేసశన నరేంద్ర వర్మ సూచనల మేరకు తెలుగు మహిళల ఆధ్వర్యంలో పట్టణంలోని 30వ వార్డులో మహాశక్తి టీం ఇంటింటికి వెళ్లి పార్టీ మహానాడులో చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మనిఫెస్టోను వివరించారు. మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి పథకంపై అవగాహన కల్పించారు. ఆడబిడ్డ నిధి ద్వారా అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.1500, దీపం పథకం ద్వారా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు, జిల్లా వ్యాప్తంగా ఉచిత బస్ ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, ఆంద్రేయ, షేక్ సిరాజ్, బసవయ్య, పల్లం సరోజిని, చెన్నుపాటి హైమావతి, జాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, పద్మ, రజిని, నజ్మ, నవనీతం రమాదేవి, మరియమ్మ, సుజాత, కాజా, జీవన్, అడేవంశీ, గోవిందు పాల్గొన్నారు.

ఉదయశంకర్‌కు డాక్టర్ దగ్గుబాటి పరామర్శ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని బోడవాడకు చెందిన సీనియర్ విలేకరి శింగవరపు ఉదయశంకర్ (ఈనాడు) తల్లి నాగేంద్రమ్మ (92) ఇటీవల మరణించారు. ఆమె దశదిన కర్మ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ఆమంచి కృష్ణమోహన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ పోలూరు శివారెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్యచౌదరి, మాజీ ఎంపిపి కోట హరిప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి కొల్లా సుభాష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మండలంలోని గొల్లపూడి గ్రామ సర్పంచి యర్రాకుల రామకృష్ణ తల్లి యలమందమ్మ (80) చిత్రపటానికి ఆమంచి కృష్ణమోహన్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమంచి వెంట ఉపసర్పంచి పద్మారావు, ఆర్ సుధీర్‌బాబు, యర్రాకుల శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచి గాదె సురేష్, ముప్పాళ్ల రాఘవయ్య, జెట్టి చంద్రం, దేవరపల్లి ఉపసర్పంచి తోకల కృష్ణమోహన్, కొల్లా శ్రీహరి పాల్గొన్నారు.


ఉదయశంకర్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ దగ్గుబాటి

గడపగడపకూ సంక్షేమ పథకాలు : మోపిదేవి

ప్రజాశక్తి -నగరం

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణా రావు అన్నారు. మండలంలోని పూడివాడలో ఆదివారం గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విలెఖర్ల సమావేశం లో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సుమారు 1300 గృహాలు ఉన్నాయని అన్నారు. టిడిపికి పట్టన్న గ్రామమైనప్పటికీ సిఎం వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి సుమారు రూ.16.20కోట్ల సంక్షేమ పథకాలు అందిచామని అన్నారు. ఎ ఇంటికెళ్లి లబ్దిదారుల పుస్తకాలు చూసిన రూ.లక్షలపై చిలుకు లబ్ది చేకూరినట్లు తెలిపారు. కులం, పార్టీ, వర్గ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల వల్ల సోమరులవుతారని ప్రచారం చేసినవాళ్లే ఇప్పుడు ఇంతకన్నా ఎక్కువ పథకాలు అమలు చేస్తామని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి మోపిదేవి తనయుడు మోపిదేవి రాజివ్, ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య, గ్రామ సర్పంచి పాగోలు సుజాత, వెంకటేశ్వరరావు, మండలంలోని సర్పంచులు అనిల్ కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ బుల్లియ్య, జాలాది సునీల్, ఎంపీటీసీలు మన్యం పద్మావతి పాల్గొన్నారు.


గడప గడపకు ప్రభుత్వ కార్యమ్రంలో ఎంపి మోపిదేవి

రోటరీలో సభ్యులు చేరాలని ప్రదర్శన

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీలో చేరండనే నినాదంతో రోటరీ సభ్యులు బహిరంగ ప్రదర్శన నిర్వహించారు . కార్యక్రమంకు క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు నాయకత్వం వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రోటరీలో చేరి సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం ప్రోత్సహిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు. ఇప్పటివరకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు వాటర్ ప్లాంట్, ప్రజా మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, రోటరీ సామాజిక భవనం, నూతలపాడు వాటర్ ప్లాంట్, ఆదిపూడి వాటర్ ప్లాంట్, చెక్ డ్యామ్ యొక్క ఫోటోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కోమటి ఆంజనేయులు, దండాశ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్, పాబోలువెంకటేశ్వర్లు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కోడూరు సుబ్రహ్మణ్యచారి పాల్గొన్నారు.



పర్చూరులో ర్యాలీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

బండ్లబాబుకి పలువురు పరామర్శ

ప్రజాశక్తి - వేటపాలెం

రామన్నపేట పంచాయితీ వార్డు ఉప ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఈనెల 10న తలెత్తిన ఘర్షణలో దాడికి గురైన బండ్ల వెంకటేశ్వరరావు(బాబు)ను పలువురు నాయకులు పరామర్శించారు. బండ్ల బాబుపై దాడికి దిగిన వారిని గుర్తించి పోలీసులు తక్షణమే శిక్షించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంత ప్రసాద్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. బండ్ల బాబుని పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ పోతుల సునీత, సిపిఐ కార్యదర్శి మేడ వెంకట్రావు ఉన్నారు.


బండ్ల బాబును పరామర్శిస్తున్న పోతుల సునీత

సహేతుకంగా తిరస్కరణ

వేటపాలెం : రామన్నపేట పంచాయతీ వార్డు ఉప ఎన్నికల నామినేషన్లను సరైన ఆధారాలతోనే తిరస్కరించినట్లు చీరల ఆర్డీవో సరోజినీ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఘర్షణ వాతావరణం లో రామన్నపేట ఉప ఎన్నికలలో దాఖలు చేసిన నామినేషన్లు 8మంది అభ్యర్థులు ఆర్డిఓ కోర్టులో దాఖలు చేశారని తెలిపారు. వాటి పూర్వపరాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ప్రాపర్ ఎవిడెన్స్ చూపలేకపోవటతో వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించినట్లు తెలిపారు.

స్వాములుకు నోటీసులు అందజేత

వేటపాలెం : సోషల్ మీడియా ఆధారంగా చీరాల నియోజకవర్గంలో ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశాడనే కారణంతో జనసేన నాయకులు ఆమంచి స్వాములకు వేటపాలెం పోలీసులు 141 నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆమంచి స్వాములు వేటపాలెం పోలీస్ స్టేషన్లో సంతకం పెట్టి నోటీసులను స్వీకరించారు.

మద్యంసేవించి వాహనాలు నడపరాదు

రేపల్లె : మద్యం సేవించి వాహనాలు నడపరాదని పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్, ఇసుకపల్లి, పద్మావతి థియేటర్ సెంటర్‌లలో వాహనాలను తనికీలు నిర్వహించారు. వాహన దారులకు పలుసూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదాలకు కారణమౌతోందన్నారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణ సమయంలో వాహనాలకు సంబంధించిన అన్నికాగితాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సరైన పత్రాలు లేకుంటే చలానాలు విధిస్తామన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ మస్తాన్‌రావు ఉన్నారు.

180 బస్తాల రేషన్ బియ్యం సీజ్

వేటపాలెం : మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగటం లేదు. తాజాగా ఆదివారం తెల్లవారు జామున ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పక్కా సమాచారంతో కాపుకాచి వేటపాలెం నుండి పందులపల్లి వెళుతున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్నారు. ఈ దాడిలో లారీ డ్రైవర్ పరారైనట్లు ఓంకారయ్య తెలిపారు. ఈ బియ్యం మోటుపల్లి వెంకటరావుకు చెందినవిగా ఆయన వెల్లడించారు. వేటపాలెం పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు. విచారణ అనంతరం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు రూరల్ : వలపర్లలో పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. 5గురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుండి రూ.5200నగదు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోడూరి కమలాకర్ తెలిపారు. అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలతో రేగడిపల్లి యుపి పాఠశాల

- మూడు గదుల్లో ఎనిమిది తరగతులు, 200 మంది విద్యార్థులు
- నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణ పనులు
- సతమతమవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని రేగడపల్లి యుపి పాఠశాల పలు సమస్యలతో సతమతమవుతుంది. ఈ పాఠశాలలో మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు 200 మంది పైగా విద్యార్థులు విద్యన అభ్యసిస్తున్నారు. 200 మంది విద్యార్థులకు ఐదు గదులు ఉన్నాయి. అందులో ఒక గది ప్రధానోపాధ్యాయుని ఆఫీస్ గది, మరొక గది స్టాప్ రూమ్, స్టాక్ రూమ్‌కు ఉపయోగిస్తున్నారు. 200 మంది విద్యార్థులకు మూడు గదులలో విద్యను అభ్యసించడం కష్టముతో కూడుకున్న పని. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల ఉపాధ్యాయులు బోధించే విద్యాబోధన విద్యార్థులకు సరిగా అర్థం కాని పరిస్థితి. దీంతో విద్యార్థులు సతమౌతున్నారు. నాడు-నేడు క్రింద రెండు తరగతి గదులు నిర్మాణానికి, వంటగది, బాత్రూం, ప్రహరి నిర్మాణానికి వెరసి రూ.88 లక్షలు నిధులను మంజూరు చేయాల్సి ఉండగా ఆ నిధులలో ఇప్పటికీ రూ.44 లక్షలు నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఆ నిధులతో అదనపు గదుల నిర్మాణం స్లాబ్ వరకు జరిగింది. నిధులు పూర్తిస్థాయిలో మంజూరు కాక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రతకు, అప్పుడప్పుడు కురిసే వర్షాలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల బాధలు వర్ణనాతీతం. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు ఏర్పాటు చేద్దామనుకుంటే ఇంకా 44 లక్షల



నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిన అదనపు గదులు

నిధులు మంజూరు కావాల్సి ఉందని, బిల్లులురాక నానా ఇబ్బందులు పడుతున్నామని చైర్మన్ బుక్క శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు



అసంపూర్తిగా నిలిచిన గదుల్లో తరగుతులు నిర్వహిస్తున్న దృశ్యం

చేద్దామనుకుంటే ఈ పాఠశాలను చూసి విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తారని భయంగా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ పాఠశాల సమస్యను మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని పాఠశాల చైర్మన్ బుక్క శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు వి.రామాంజనేయులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని యూపీ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నాడు నేడు కింద రావాల్సిన రూ.44 లక్షల నిధులను తక్షణమే మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992-93 వ సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 30 సంవత్సరాల అనంతరం కలుసుకున్న సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని తమకు విద్యార్థులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆనాడు ఉపాధ్యాయుల దండన, క్రమశిక్షణలతో కూడిన విద్య చెప్పడం వల్ల తాము ఉన్నత స్థానాలకు చేరుకున్నామని పలువురు విద్యార్థులు ఈ సందర్భంగా తమ ఉపాధ్యాయులతో ఆనందభాష్పాలు రాల్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు - డాక్టర్ జవహర్

ప్రజాశక్తి-చీమకుర్తి

విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి జవహర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నారాయణ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన కాబినేట్ మెంబర్స్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాల పెంపొందించడంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు.చదువుతోపాటు విద్యార్థులలో సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనేలా చేయాలన్నారు. సమాజ అవగాహన కూడా అవసరమన్నారు. ప్రధానోపాధ్యాయులు వై రామకృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులతో సృజనాత్యక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ అధికారిణి కరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో ఎంపి మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈనెల 14, 15 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈనెల 14న సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రి 7 గంటలకు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. ఈనెల 15న ఉదయం 7.30 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 8 గంటలకు ఒంగోలులో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో జరిగే 77 వ భారత ఒంగోలులో రంగారాయుడు చెరువు కట్టపై మునిసిపల్ కార్పోరేషన్ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్మించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక మంగమూరు రోడ్డు బైపాస్ వద్ద ఉన్న వైఎస్ఆర్ పార్టీ కార్యాలయ ఆవరణలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు స్థానిక కర్నూలు రోడ్డులో సెయింట్ జేవియర్స్ స్కూలు వద్ద నున్న మిలిటరీ క్యాంటీన్ ఆవరణలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా యల్లమందారెడ్డి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-దరిశి

తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం పిఎసిఎస్ నూతన చైర్మన్‌గా తూర్పుగంగవరంకు చెందిన యాడిక యల్లమందారెడ్డి ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా తూర్పుగంగవరంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు మద్దిశెట్టి రవీంద్ర తాళ్ళూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి చేతులమీదుగా ధృవీకరణపత్రం అందించారు. ఈ సందర్భంగా యల్లమందారెడ్డి మాట్లాడుతూ తనకు పిఎసిఎస్ చైర్మన్‌గా పదవి ఇచ్చినందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు, మద్దిశెట్టి రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో దరిశి మాజీ ఎఎంసి చైర్మన్ వెన్నపూస వెంకటరెడ్డి, మండల కోఆప్షన్ మెంబరు వలి, నాయకులు కృష్ణారెడ్డి, సర్పంచ్ వలి, నాయకులు నరసారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కటకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-మార్కాపురం

ఈ నెల 19వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణపతి నవరాత్రి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఏర్పాట్లు ఘనంగా ఉండాలని మార్కాపురం విఘ్నేశ్వర ఉత్సవ కమిటి స్థానిక నెహ్రూ బజారులోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గోపాలుని హరిహరరావు తెలిపారు. ఈ ఏడాది కూడా కొన్ని వినాయక ప్రతిమలను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఎలా ఉండాలనే దానిపై చర్చించారు. నిమజ్జనంలో ఎలాంటి అపశృతి లేకుండా సజావుగా జరిగేలా కమిటీ బాధ్యత తీసుకోవాలన్నారు.

ఖరీఫ్ ఖతం-రైతులు లబోదిబో...



అంది అందని గడ్డిపీచులను తింటున్న పశువులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఖరీఫ్ సీజన్లో నైరుతి రుతుపవనాలు వస్తాయని పంటలు వేసుకోవచ్చు అని ఎదురు చూస్తున్న రైతులకు తీవ్ర నిరాశ ఎదురైందని వత్తిదారుల సంఘం జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య అన్నారు, అరకోరా వర్షాలు పడితే నూటికి 30% దుక్కులు దున్నుకోవడం జరిగిందని, మిగతా 70 శాతం బీడు భూములుగా మారాయని, ఇప్పుడున్న 36 డిగ్రీల ఎండలో పాడి గేదెలు, గొర్రెలు, కోడి పిల్లలు ఈ బీడు భూములలో వచ్చిరాని నాచు గడ్డి తినటానికి ఎండలలో తీవ్రమైన శ్రమ పడాల్సి వస్తుందని వారన్నారు, భూమి మీద అంది అందని గడ్డిపీచులు తినడం వల్ల గేదెలకు గొర్రెలకు నులిపురుగులు, నాము వ్యాధులకు గురవుతాయని తెలిపారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ప్రభుత్వ పరంగా ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు ఆర్థికంగా ఆదుకోవటానికి ఎంతైనా అవసరం ఉందని ఆయన తెలిపారు. రబీ సీజన్ కోసం ఆకాశం వైపు చూస్తున్నారని దానిలో భాగంగానే పొగాకు రైతులు పొగాకు పంట కాల్చుకోవటానికి బ్యార్నిలు వద్ద టన్నులు కొలది కర్రలు స్టాక్ పెట్టుకోవడం జరిగిందని అన్నారు. వర్షాకాలం అనుకూలిస్తే మినుము, బొబ్బర్ల పంట వేయటానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు గడపగడపకు, వారాహి, పాదయాత్రలు జరుగుతున్న సందర్భంగా ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని ప్రభుత్వ పరంగా రావలసిన, కావలసిన విత్తనాలు, ఆర్థిక పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అన్నారు.

నూతన వధూవరులకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి సెంట్రల్ ఎడిటోరియల్ బోర్డు సభ్యులు షేక్ ఖాజావలీ కుమారుడు షాజహాన్, రుకియా వివాహ రిసెప్షన్ కనిగిరి షాదీఖానాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వధూవరులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్లు ఎంఎల్‌వి.ప్రసాదరావు, శివరామకృష్ణ, మఫిషిల్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, టెక్నికల్ మేనేజర్ శ్రీనివాస్, ఒంగోలు బ్యూరో ఎస్వీ బ్రహ్మం, నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జి కె.కోటేశ్వరరావు, ప్రజాశక్తి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలియజేస్తున్న వి.శ్రీనివాసరావు

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో ప్రస్తుత జరుగుతున్న విషయాలు, వాటి వెనుక ఉన్న అర్థాన్ని గ్రహించటానికి భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ది కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో " మన రాజ్యాంగం – ఒక అవగాహన " అనే అంశంపై సెమినార్ ఆదివారం జరిగింది. తొలుత ఇటీవల మరణించిన జాతీయ జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి జంపా కష్ణ కిషోర్‌కు నివాళి అర్పించి గణాంకాల ప్రకారం దేశ జనాభాలో 0.1 శాతం కన్నా తక్కువ మంది మాత్రమే రాజ్యాంగం పట్ల అవగాహన కల్గి ఉన్నారన్నారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ భావజాల ప్రచారం అధికారంలో ఉన్నవారు వారికి అనుకూలంగా మార్చుకున్నారు. రాజ్యాంగ పీఠికలో ఉన్న ప్రతి పదం అర్థాన్ని సరిగ్గా అర్థం చేసుకొని జాగురూకతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు చిట్టెం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కొల్లా మధు, గయాజ్, కాంగ్రెస్ నాయకులు శ్రీపతి ప్రకాశం, కొండమ్మ, చిన్నాజీ, జిల్లెళ్ళ వెంకటేశ్వర్లు, మీనా, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిడమలూరు చెరువులో చేపలు మృతి

- దుర్గంధం వెదజల్లుతున్న చెరువు..
- పట్టించుకోని పాలకవర్గం.
- ఆందోళనలో గ్రామస్తులు.

ప్రజాశక్తి - టంగుటూరు

మండలంలోని ఎం నిడమలూరు చెరువులో రాత్రికి రాత్రే వందల సంఖ్యలో చేపలు మతి చెందాయి. దీంతో ఆదివారం చెరువు సమీపానికి వచ్చిన గ్రామస్తులు దుర్గంధంతో ఆందోళన చెందుతున్నారు. చెరువు చుట్టూ పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది.. అదేమని అడిగే వారు లేరు. నోరు తెరిచి ఎవరైనా పాలకవర్గాన్ని ప్రశ్నిస్తే వారికి రాజకీయ రంగు పులిమి వివాదాలు సష్టిస్తున్నారు. సమీపంలోని కాలువల నుండి నీళ్లకు కొట్టుకొచ్చిన చేపలు వందల సంఖ్యలో నిడమలూరు చెరువులో సేద తీరుతున్నాయి. చేపలు చెరువులో ఉండడం వల్ల నీరంతా ఎంతో పరిశుభ్రంగా ఉంటోంది. ఈ చేపలను గ్రామస్తులు పలువురు అప్పుడప్పుడు వలలు వేసి పట్టుకుని తీసుకెళ్తున్నారు. అయితే ప్రస్తుతం చేపలను చంపేందుకు ఎవరైనా చెరువులో కావాలనే గుళికలు చల్లి చంపేశారా లేకపోతే మరేమైనా కారణమా అనే విషయాలు తెలియ రాలేదు. ఆదివారం కావడంతో పంచాయతీ అధికారులు కూడా ఎవరూ అందుబాటులో లేరు. చెరువులో చేపలు చనిపోయి చెరువంతా దుర్గంధంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం అయితే చాలు ప్రతిరోజూ చెరువు చుట్టూ ఉన్న గట్లపై వందల సంఖ్యలో మందుబాబులు వీరంగం సష్టిస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు గ్రామస్తులు సచివాలయం మహిళా పోలీసు, సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు గ్రామస్తులు చెరువులో చేపలు చనిపోయిన విషయం పంచాయతీ పాలకవర్గం సిబ్బందిని అడగ్గా 'అయితే మేమేం చేయమంటావని' వారు ఎదురు ప్రశ్నిస్తున్నట్లు పంచాయతీ పాలకవర్గం వ్యవహార శైలిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చనిపోయిన చేపలను వెంటనే తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


చెరువులో మృతి చెందిన చేపలు


టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

టాలెంట్ టెస్టుకు విశేషస్పందన

ప్రజాశక్తి-దరిశి

దరిశిలో జరిగిన టాలెంట్ టెస్టుకు విశేషస్పందన వచ్చింది. ప్రజా సంకల్పవేదిక ఆధ్వర్యంలో దరిశి నియోజకవర్గంలో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు మొత్తం 4000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దరిశి మండలంలో 2500 మంది, మిగతా మండలాలలో 1500 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం రంగసాయిరెడ్డి, కోటిరెడ్డి, సాయితేజ, వెంకటేశ్వర్లు, నవ్య, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.


దశపర్ని కషాయం తయారు చేస్తున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని యూనిట్‌లో ఆదివారం సేంద్రియ ఎరువులు, కషాయలపై రైతులకు శిక్షణనిచ్చారు. పంటల యాజమాన్యం, ద్రవ జీవామతం, ఘన జీవామతం, పంచగవ్య తయారీ విధానం, దశపర్ని కషాయం ,పంచగవ్యలో ఉండే పోషకాలు, ఎంత మోతాదులో వాడాలి, నిలువ కాలము, ఏ సమయంలో వాడాలలో ప్రదర్శనతో అవగాహన కల్పించారు. చీడ పీడలను నివారించే దశపర్ని కషాయం తయారీ విధానం, ఎంత మోతాదులో వాడాలి, ఎప్పుడు వాడాలి ప్రదర్శించి చూపించారు. అదేవిధంగా ఆకు మచ్చ తెగులును నివారించడానికి పుల్లటి పెరుగు ద్రావణం, ఎండు తెగులును తట్టుకోవడానికి ట్రైకోడర్మ విరిడితో విత్తన శుద్ధి, భూమిలో పెంట ఎరువుతో వేసి నివారించే పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ యాంకర్ మద్దయ్య, యూనిట్ ఇంచార్జి శ్రీనివాసగౌడ్, ఐసిఆర్‌పిలు దేవి, శేషమ్మ, శివప్రసాదరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-దరిశి

మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఇల్లూరి గాలిరెడ్డి (84) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన 1995 నుండి 2001 వరకు గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. దరిశి మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డికి అనుచరుడిగా, కాంగ్రెస్‌పార్టీ సీనియరు నాయకుడుగా ఆ గ్రామానికి పలు సేవలు అందించారు. ప్రస్తుతం వైసిపిలో కొనసాగుతున్నారు. ఆయన మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి తెలిపారు.

అత్యధిక మంది ఎండిఆర్‌టిలు కావాలి

ప్రజాశక్తి-దరిశి

జీవిత భీమాలో పనిచేస్తున్న ఏజెంట్లు అత్యధికంగా ఎండిఆర్‌టిలు కావాలని స్థానిక ఎల్‌ఐసి అనుబంధ కార్యాలయ మేనేజరు కెవి మహదేవయ్య అన్నారు. ఆదివారం ఎల్‌ఐసి బ్రాంచిలో అభివృద్ధి అధికారి రవీంద్ర యూనిట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహదేవయ్య ఏజంట్లతో మాట్లాడుతూ ఎక్కువమంది బ్రాంచి టార్గెన్ లక్ష్యాలను పెంచి ఎండిఆర్‌టిలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎస్‌సి రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు విత్తనాలను సరఫరా చేశామని వీరభద్రాపురం సర్పంచ్ ఆలేటి ఆశీర్వాదం తెలిపారు. ఆదివారం వీరభద్రాపురంలో ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం క్రింద ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులకు విత్తనాల కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సాధికార సంస్థ వారు గ్రామాల్లో సేంద్రీయ పద్ధతిలో ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఎస్‌సి రైతులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఎస్‌సి రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలువ చేసే వివిధ విత్తనాల కిట్టును రాయితీతో సరఫరా చేశామని వైస్ సర్పంచ్ ముటుకూరి కోటేశ్వరరావు అన్నారు. జొన్నలు, మొక్కజొన్న, జీలగలు, పిల్లి పెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, కందులతో పాటు కిచెన్ గార్డెన్ కిట్ తదితరాలు ఉంటాయన్నారు. ఈ కిట్టును రైతులు సద్వినియోగం చేసుకోని అభివద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు ముటుకూరి యల్లయ్య, ప్రసాద్, డీలర్ ముటుకూరి పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నా జోలికి వస్తే... అవినీతిపై వెంటాడుతా...


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

నా జోలికి వస్తే మాత్రం ఊరుకోబోనని... మీ అవినీతిపై వెంటాడుతానని మార్కాపురం వైసిపి ముఖ్య నేతలను హెచ్చరించారు అదే పార్టీకి చెందిన పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి కోరుకున్న తనను వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తాను వ్యక్తిగత విమర్శలకు దూరమన్నారు. స్వార్థం లేకుండా మార్కాపురం నియోజకవర్గ ప్రజల బాగు కోసం కష్టపడుతున్నానని చెప్పారు. నా రాజకీయ ప్రయాణంలో జిల్లాలో నాకంటూ ఒకరు గురువుగా బాలినేని వాసన్న ఉన్నాడని చెప్పుకున్నారు. నేను ఎప్పటికీ ఆయన శిష్యుడిగా ఉంటానన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏప్రిల్ నెల 12న మార్కాపురం రావడం జరిగిందన్నారు. తాను సిఎంను కలవడానికి హెలిప్యాడ్ పాసు, స్టేజి పాసు కోసం మంత్రి డాక్టర్ సురేష్‌ను సంప్రదించడం జరిగిందన్నారు. అప్పుడు తనను అందరిలో అవమానించారన్నారు. దీనిలో ప్రధాన పాత్ర పోషించింది మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి అని చెప్పారు. తనకు జరిగిన అగౌవరంపై పార్టీ పెద్దలకు, మాజీ మంత్రి బాలినేనికి వివరించినట్లు చెప్పారు. మార్కాపురం నియోజకవర్గంలో పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్లు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఇప్పటికైనా కుటుంబ పాలన తగ్గించుకోవాలన్నారు.

టిడిపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌లతో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం బలోపేతానికి కషి చేయాలనీ, ప్రతీ మండలంలో, క్లస్టర్‌లో, యూనిట్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ బూత్‌లో కొత్త ఓటర్ల చేరికలు, డెత్ ఓటర్లను తొలగించడం, మార్పులు చేర్పులు వంటి అంశాలపై దష్టి పెట్టాలని, వైసీపీ అరాచక పాలనను ప్రజలకు వివరించి, నాడు తెలుగుదేశం హయాంలో జరిగిన అభివద్ధిని గుర్తు చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులు పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరటం ఖాయమని అశోక్ రెడ్డి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలనీ, ప్రతీ ఓటు కీలకమైనదని అప్రమత్తంగా ఉండి ఓటర్లను తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపే విధంగా కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, యూనిట్ ఇన్‌ఛార్జీలు, తెలుగుదేశం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

15న దేశవ్యాప్తంగా జెండాను ఎగురవేయాలి

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

భారతీయ యువజన కాంగ్రెస్ శక్తి సూపర్ షీ ప్రధాన కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15న దేశవ్యాప్తంగా మహిళలు జెండాను ఎగురవేయాలని స్టేట్ యువజన కాంగ్రెస్ సెక్రెటరీ అన్నలదాసు ప్రవీణ్ కుమార్ తెలిపారు. యర్రగొండపాలెంలో భారతీయ యువజన కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ప్రకాశం జిల్లా యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దుగ్గెంపూడి బాలకష్ణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ యువజన కాంగ్రెస్ సెక్రెటరీ అన్నలదాసు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, అసెంబ్లీ స్థాయిలో మహిళా సాధికారత యొక్క సంగ్రహావలోకనం కనిపిస్తుందని తెలిపారు. యూత్ కాంగ్రెస్ గతంలో అనేక కార్యక్రమాల ద్వారా ఇటువంటి ప్రయత్నాలు చేస్తోందని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


గడియారాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోడ గడియారాలు పంపిణీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

స్థానిక మండల కేంద్రంలోని ఏపి పాఠశాలకు సీసీకేఆర్ చిట్ ఫండ్ కంపెనీ ఆధ్వర్యంలో గోడ గడియారాలు, కీ ఛైయిలను ఆ సంస్థ మేనేజర్లు ఉచితంగా పంపిణీ చేశారు. తహశీల్దార్ కార్యాలయం, నాగంపల్లి యుపి పాఠశాలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు. ఈ గోడ గడియారాలు, కీ చెయిన్‌లను ప్రకాశం జిల్లా చిట్ ఫండ్ కంపెనీ మేనేజర్ సుధాకర్, పొదిలి బ్రాంచ్ మేనేజర్ ఎం శ్రీనివాస్ రెడ్డిలు ఆయా పాఠశాలలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్‌కె డాంగే షరీఫ్, వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్‌కే జీ మస్తాన్, సాయి లక్ష్మి, రహీం భాగ్యలక్ష్మి ఆశాలు పాల్గొన్నారు.

సొంత భవనం లేని శాఖా గ్రంథాలయం

ప్రజాశక్తి - బాపట్ల

- గ్రామాల్లో సొంతభవనాలు
- జిల్లా కేంద్రంలో అద్దె భవనం
- గత ప్రభుత్వంలో నిధులు, స్థలం కేటాయింపు
- పట్టించుకోని ప్రస్తుత ప్రభుత్వం

జిల్లా కేంద్రమైన బాపట్లలో శాఖా గ్రంథాలయానికి సొంత భవనం లేదు. స్వాతంత్ర్యానంతర కాలం నుండి ప్రజలకు విజ్ఞానాన్ని అందించే పుస్తక బండాగారంగా పేరుపొందిన బాపట్ల శాఖా గ్రంథాలయానికి సొంత భవనం లేక అద్దె భవనంలో మగ్గుతోంది. వసతుల లేమితో పాఠకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్న శాఖా గ్రంథాలయంలో పత్రిక పఠనానికి సరైన వసతులు లేవు. 1954లో గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ బాపట్లలో శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇక్కడి గ్రంథాలయం వివిధ అద్దె భవనాల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రంథాలయం ఏర్పాటుచేసి ఏడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ సొంత భవనానికి నోచుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంతో పాటు విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్ల కొత్తగా జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకుంది. అయినప్పటికీ శాఖ గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడం పాఠకుల విమర్శలకు దారితీస్తోంది. బాపట్లలో గ్రంథాలయం ఏర్పాటు అనంతరం 1959లో పిట్టలవాని పాలెం మండలం మంతెనవారిపాలెంలో ఏర్పాటు చేసిన శాఖా గ్రంథాలయానికి సొంత భవనం ఉంది. అదే మండలం ఖాజీపాలెంలో 1963లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ గ్రంథాలయానికి సొంత భవనం సమకూరింది. 1965లో బాపట్ల మండలం అప్పికట్లలో గ్రంథాలయం సొంతభవనంలో ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో రూ.25లక్షలతో నూతన భవనం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. చరిత్ర గల చందోలులో 1975లో ఏర్పాటు



అద్దె భవనంలో బాపట్ల జిల్లా గ్రంథాలయం

చేసిన గ్రంథాలయానికి సొంత భవనం ఉంది. బాపట్ల మండలం అప్పికట్లలో 1979లో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అక్కడా సొంత భవనంలోనే గ్రంథాలయం కొనసాగుతోంది. కర్లపాలెంలో గ్రంథాలయానికి రెండంతస్తుల సొంత భవనం ఉంది. మండలాల వ్యవస్థ ఏర్పాటయ్యాక మండల కేంద్రమైన పిట్టలవానిపాలెంలో 1986లో సొంత భవనంలోనే గ్రంథాలయం ఏర్పాటు చేశారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో, అనేక గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలను సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. పాలకులు మారుతున్నా బాపట్ల శాఖ గ్రంథాలయానికి సొంత భవనంపై దృష్టి పెట్టలేదు. పట్టణంలోని మీసేవ వద్ద ఆంజనేయ అగ్రహారం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. గ్రంథాలయ సంస్థ రూ. 2కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులు ప్రస్తుత ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయని చెబుతున్నారు. ప్రభుత్వ ఖజానా నుండి ఆ నిధులు తిరిగి గ్రంథాలయ సంస్థకు మళ్లీస్తే తప్ప ఇక్కడ భవన నిర్మాణం పనులు ప్రారంభం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీనికోసం గ్రంథాలయ సంస్థ అధికారులు కృషి చేస్తూనే ఉన్నారని చెబుతున్నారు. అయినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా బాపట్లలో శాఖా గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి ఎంఎల్ఎ కోన రఘుపతి ప్రత్యేక చొరవ చూపాలని పాఠకులు కోరుతున్నారు.



వరలక్ష్మమ్మకు నివాళి అర్పిస్తున్న ఫోరంఫర్ బెటర్ నేతలు

మహిళా చైతన్య దీప్తి కనుపర్తి

బాపట్ల : మహిళలను చైతన్యపరిచి స్వాతంత్ర సమరంలో భాగస్వాములుగా చేసిన ఘనత కనుపర్తి వరలక్ష్మమ్మ కే దక్కుతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. వరలక్ష్మమ్మ 45వ వర్ధంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని శీలంవారిపాలెంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. గాంధీజీ శిష్యురాలిగా కడవరకు వరలక్ష్మమ్మ ఖద్దరు చీరలనే ధరించారని అన్నారు. బాపట్లలో 1933లో స్త్రీ హితైషిణి మండలిని స్థాపించి మహిళాభ్యుదయానికి పాటుపడ్డారని గుర్తు చేశారు. ఓటు పురాణాన్ని రచించి ఓటు హక్కు ప్రాధాన్యతను మహిళలకు చెప్పడంలో విశేష కృషి చేశారని అన్నారు. ఆమె తన జీవితాన్ని స్త్రీ జనాభ్యుదయానికి అంకితం చేశారన్నారని అన్నారు. కార్యక్రమంలో స్వయం సేవకులు బొమ్మిశెట్టి బాలాజీ, లేళ్ళ సుధాకర్, పి నాగనవీన్, వేముల ప్రసాద్, ఉమా మహేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.



మహాశక్తి ప్రచార యాత్ర

టిడిపి మహాశక్తి ప్రచారం

భట్టిప్రోలు : మండలంలోని ఆళ్లముడి, పల్లెకొన, రాచురు గ్రామాలలో టిడిపి మహాశక్తి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మహానాడులో చంద్రబాబు ప్రకటించింన మినీ మ్యానిపిస్టోను ప్రజలకు వివరించారు. భవిష్యతుకు గ్యారంటీ ద్వారా పేద ప్రజలకు అందించనున్న పలు సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. వేమూరు టిడిపి మహిళా విభాగం అధ్యక్షులు ఛందోలు పృద్విలత, టిఫిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా, ఎస్సి సెల్ రాష్ట్ర నాయకులు కనపర్తి సుందరరావు, బట్టు మల్లిఖార్జునరావు, యడ్ల జయసిలరావు, రాయన ప్రసాద్, వెజెల్ల సతీష్, చినబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబు

16న హలో లోకేష్

భట్టిప్రోలు : ఈ నెల 16న మంగళగిరిలో జరిగే హలో లోకేష్ కార్యక్రమానికి వేమూరు నియోజకవర్గం నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా కోరారు. హలో లేకేష్ గురించి వివరించేందుకు నేడు అనగా 14న వేమూరులో నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు హాజరవుతారని అన్నారు. టిడిపి అనుబంధ విభగలైన తెలుగు యువత, బిసి సెల్, ఎస్ సి సెల్, తెలుగు రైతు, మహిళ తదితర విభాగాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రికి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

భారత దేశ సమైక్యతను సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి భారతదేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అనే ప్రతిజ్ఞను రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు తెలుగు వారు కావటం తెలుగుజాతికి గర్వకారణమని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ పేర్కొన్నారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో జరిగిన పైడిమర్రి వెంకట సుబ్బారావు 35వ వర్ధంతి సభకు ఆయన అధ్యక్షత వహించారు. పైడిమర్రి కాలభైరవుడు, ఉషస్సుకథలు, దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు వంటి రచనలు కూడా చేశారని తెలిపారు. ప్రజాకవి, వైద్య



పైడిమర్రికి నివాళులర్పిస్తున్న నేతలు

విద్వాన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 1964లో బెంగళూరులో ప్రముఖ న్యాయ నిపుణులు మహమ్మద్ కరీమ్ చాగ్లా అధ్యక్షతన జరిగిన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశంలో ప్రతిజ్ఞను జాతీయ స్థాయిలో అన్నీ పాఠశాలల్లో అమలు పరచాలని నిర్ణయించారని వివరించారు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ ప్రతిజ్ఞను అన్నీ బాషల్లో పాఠ్య పుస్తకాలలో ప్రచురించి దేశవ్యాప్తంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించటం 1965 జనవరి 26 నుండి అమలులోకి వచ్చిందని అన్నారు. ఈ సభలో ఆదం షఫీ, ఎం జాకబ్, ఎన్ కృష్ణ, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళీరాధాకృష్ణమూర్తి, కొమ్మూరి సీతా రామాంజనేయులు, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

నారాయణం అవధానికి ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో రామసుశీల నిలయంలో అవధాని నారాయణం ఆత్మీయ పురస్కార సభ లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత నిర్వహించారు. అవధానం ఒక పద్యక్రీడ అని, అందులో ఆరితేరిన అవధాని నారాయణంని, పుంభావ సరస్వతి అని చంద్రశేఖర్ పేర్కొన్నారు. సభకు శ్రీరామ చంద్ర మూర్తి వ్యాఖ్యానం చేశారు. ఆశుకవిత్వ గరిమకు, సాహితీ పటిమకు, ధారణాశక్తికి, పాండిత్య ప్రకర్షకు అత్యున్నతమైన పరీక్ష అవధానమని అన్నారు. అవధాన అంశాలకు ఆశువుగా, చమత్కార భరితంగా, పూరణలు చేయడంలోనూ, సరస సంభాషణలు, చతురోక్తులతో అవధాన ప్రక్రియను నడపడంలోనూ నారాయణం సిద్ధహస్తుడని కొనియాడారు. నారాయణం బాలసుబ్రహ్మణ్యం ప్రతిభావ్యుత్పత్తులను ప్రశంసించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకర దత్తు, డివియం సత్యనారాయణ, డాక్టర్ యు దేవపాలన, ఆర్‌వి రాఘవరావు, వారణాశి రఘురామశర్మ, రోటరీసంస్థ అధ్యక్షులు చిన్నిమురళీకృష్ణ, చుండూరి మురళీసుధాకరరావు, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, చప్పిడివీరయ్య, వెంకటేశ్వర్లు,



అవధాని నారాయణం ఆత్మీయ పురస్కార సభలో ప్రముఖులు

ఇలపావులూరి శేషతల్పశాయి, ఓరుగంటి ప్రసాదరావు, లక్కరాజు విశ్వమోహన్, కొండకావూరి కుమార్, ఓరుగంటి శ్రీనివాసరావు, మిట్టాకామేశ్వరశర్మ, అద్దంకి లెవీప్రసాదు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, కోలలపూడి శ్రీనివాస రావు, వఠ్యం సీతారామశాస్త్రి, పిఎల్‌వి నర్సింహారావు, గోపినాథం హరనాథ్, కూరపాటి రామకోటేశ్వరరావు, మలాది శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, షేక్ మస్తాన్, జాగర్లమూడి ప్రతాప్, పసుపులేటి ఆంజనేయులు, కె అనిలకుమార సూరి, జమ్మలమడక హన్మంతరావు, బాచిన పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మాజీ యంపిపి నూకతోటి మృతి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మాజీ యంపిపి నూకతోటి కోటయ్య (78) ఆదివారం మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంనికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. పోలవరం యంపిటిసిగా ఎకగ్రీవంగా ఎన్నికయి యంపిపిగా పనిచేశారు. కోటయ్య స్వగ్రామం రమణరెడ్డిపాలెం. ఆయన మృతదేహని మాజీ యంపిపి మందలపు వెంకటరావు, దర్శి నియోజకవర్గం తెలుగు



నూకతోటి కోటయ్య (78)

రైతు అధ్యక్షులు మేదరమెట్ల వెంకటరావు, వేముల, శంకరాపురం గ్రామాల సర్పంచులు గజ్జెల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సూరపరెడ్డి ఏడుకొండలురెడ్డి, మాజీ యంపిటిసి జంపని శ్రీను, నాగినేని నాగేశ్వర రావు, బి హనుమంతరావు, వెల్లంపల్లి, సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులుకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న భాస్కరరావు,ప్రమీల

బ్యాంకు మేనేజర్ దాతృత్వం

మార్టూరు రూరల్ : అనాథ వృద్ధులకు బ్యాంకు మేనేజర్ చేయూత అందించారు. చలికి బాధపడుతున్న వారికీ దుప్పట్లు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. మార్టూరు సమీపంలోని విజయనగర్ కాలనిలో వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న వెంకయ్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమంలో ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సోమేపల్లి భాస్కర రావు, ప్రమీల దంపతులకు వచ్చారు. అక్కడి వృద్ధులు చలికి బాధపడుతున్న విషయాన్నీ ఆశ్రమ నిర్వాహకులు తన్నీరు శివ రాజేష్ వారి దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన మేనేజర్ అప్పటికప్పుడు ఆశ్రమంలోని 30మంది వృద్ధులకు దుప్పట్లు తెప్పించి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సత్య, తాటి రత్నారావు, భాస్కరరావు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రుజుత, ఆకాంక్షపాటిల్

కంటి వైద్యశిబిరానికి స్పందన

పంగులూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 280మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నట్లు క్లబ్ అధ్యక్షులు కానవ హనుమంతరావు, క్యాంపు కన్వీనర్ చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 175మందికి కంటి శుక్లములు ఉన్నట్లు, వారికి ఆపరేషన్లు చేయాలని డాక్టర్ రుతుజా, ఆకాంక్ష పాటిల్ చెప్పారు. శిబిరానికి రవి చంద్ర నిర్వహణ బాధ్యత చూశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ కాలేషా వలి, గుర్రం ఆంజనేయులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు (జెకేసి), పోతిన ప్రసాద్, రాయిని వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక నండూరి ప్రసాదరావు భవన్‌లో శ్రామిక మహిళ జిల్లా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, పెన్షను, ప్రసూతి సెలవులు అమలు చేయాలన్నారు. స్కీమ్‌లలో పనిచేసే వారికి అంతర్జాతీయ కార్మిక సంఘం సిఫారసుల ప్రకారం కార్మికులుగా గుర్తించాలన్నారు. స్త్రీ, పురుషులు కలసి పనిచేసే చోట లైంగిక వేధింపులను అరికట్టడానికి వేధింపుల నిరోధక కమిటీలు వేయాలన్నారు. జిల్లా కన్వీనర్ పి.కల్పన మాట్లాడుతూ మహిళలు పనిచేసే చోట మంచి వాతావరణం కల్పించటం యాజమాన్యం విధి అని తెలిపారు. పర్యవేక్షణ బాధ్యత ప్రభుత్వాలదేనని తెలిపారు. లైంగిక వేధింపుల చట్టం తేవటానికి 10 ఏళ్లు పట్టిందన్నారు. ఈ చట్టం సంస్థలలో 100 శాతం అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, పరిశుద్ధం, మాణిక్యమ్మ, కెవి.సుబ్బమ్మ, పద్మ, సుశీల, రమాదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

వైసిపికి తలనొప్పిగా మారిన ఉపఎన్నికలు

- తప్పని రెబల్స్ బెడద
- పోటీకి సై అంటున్న టిడిపి, జనసేన పార్టీలు
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ సర్పంచి ఉప ఎన్నిక వైసిపి తలనొప్పిగా మారింది. గతంలో వైసిపి తరపున గెలుపొందిన కొక్కిలిగడ్డ రోశయ్య అనా రోగ్యంతో మతి చెందాడు. దీంతో ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ పాటికే పలువురు నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉపసంహారణ సోమవారంతో గడువు ముగుస్తుంది. వైసిపి దివంగత సర్పంచి కొక్కిలిగడ్డ రోశయ్య భార్య స్వాములమ్మను అభ్యర్థిగా నిలిపింది. వైసిపి రెబల్ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు. అదేవిధంగా టిడిపి, జనసేన, బిఎస్‌పి అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 13 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పసంహారణకు సోమవారంతో గడువు ముగియనుంది. దీంతో పాకల గ్రామంలో ఆదివారం రాజకీయ వాతావరణం కనిపించింది. కొక్కిలిగడ్డ స్వాములమ్మ ఏకగ్రీవంగా ఎన్నికవుతారని అందరూ భావించారు. అయితే వైసిపి తరపున రెబల్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. దీంతో వైసిసి తలనొప్పిగా మారింది. పాకలలో ఎక్కువమంది పోటీ చేయడంతో కాపులతో సమావేశాల నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా ఓ కొలిక్కి రాని పరిస్థితి ఉంది. వైసిపియ రెబల్ అభ్యర్థిగా గొల్లపోతు గోవర్ధన్ పోటీలో ఉండటంతో టిడిపి టిడిపి కూడా వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. రెబల్ అభ్యర్థులు పోటీలో ఉండటంలో వైసిపి అభ్యర్థి కొక్కిలిగడ్డ స్వాములమ్మ ఎన్నికల బరి నుంచి తప్పుకొనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. కొక్కిలిగడ్డ స్వాములమ్మ పోటీ నుంచి తప్పుకుంటే టిడిపి, వైసిపి రెబల్ అభ్యర్థి మధ్య పోటీ ఉంటుందని భావిస్తున్నారు. నామినేషన్లు ఉపసంహారణ అనంతరం ఎవరూ పోటీలో ఉంటారనే విషయం తేలుతుంది.



పాకల పంచాయతీ కార్యాలయం

|| సూక్ష్మపోషకాలపై .. ||

రాయితీకి మంగళం

- జిప్సం, జింక్ సల్ఫేట్,బోరాన్ కోసం రైతుల ఎదురు చూపు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అన్నదాతల పెదవి విరుపు

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడితే అది పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భూసార పరీక్షల ఆధారంగా లోపాలను గుర్తించాలి. నివారణకు తగిన సూక్ష్మపోషకాలను వినియోగిస్తే ఎరువుల వినియోగం, పెట్టు బడి తగ్గుతుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగవుతున్నాయి. సారం లోపించిన భూములకు జింకు, బోరాన్, జిప్సమ్ వంటి సూక్ష్మపోషకాలు అవసరం. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు వీటిని 50 శాతం రాయితీపై సరఫరా చేసేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిపై రాయితీ పూర్తిగా నిలిపి వేసింది. దీంతో రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల వారిపై అదనపు భారం పడుతోంది.

గత ప్రభుత్వం హయాంలో జింకు సల్ఫేటు 10 కిలోలు రూ. 380 ఉండగా రాయితీపై రూ.180 రైతులకు అందించారు. చివరి రెండేళ్లలో నూరు శాతం రాయితీపై పంపిణీ చేశారు.

గత మూడేళ్ల నుంచి భూసార పరీక్షలను నిలిపివేశారు. ఈ ఏడాది ఆలస్యంగా భూసార పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం వరినాట్లు పూర్తి కావస్తున్నాయి. అయినప్పటికీ భూసార ఫలితాలు వెల్లడి కాని పరిస్థితి. సాధారణంగా కొన్ని భూముల్లో జింకు ధాతు లోపం ఎక్కువగా ఉంటుంది. అందుకే దీనిని దమ్ములో వేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం సరఫరా చేయక పోవడంతో రైతులు 20 కిలోల జింకు రూ.550 కొనుగోలు చేయాల్సి వస్తోంది. దమ్ములో ముడి జింకు వేయని రైతులు ప్రస్తుతం పిచికారీ చేసే చిలేటెడ్ జింకును రూ.450 కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు.



సూక్ష్మపోషక ఎరువులు

దిగుబడిపై ప్రభావం..

వరిపంటలో జింకు లోపం ఏర్పడితే ఆకులు మధ్య భాగం పసుపురంగులో మారి మొక్క గిడసబారి దిగుబడి తగ్గుతుంది. ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల వరకూ దిగుబడి తగ్గే అవకాశం ఉంది. బోరాన్ పూత దశలో కీలకంగా పని చేస్తుంది. ఆకుల్లో తయారయ్యే ఆహారాన్ని అది అన్ని భాగాలకు చేరుస్తుంది. ఇనుపధాతు లోపం ఏర్పడితే వరిలో ఆకులు ఎర్ర బారిపోతాయి. పంటకు సాధారణ ఎరువులు ఎంత అవసరమో సూక్ష్మ పోషకా సూక్ష్మపోషకాలు కూడా అంతే అవసరం.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

నీరజ, ఎడిఎ యర్రగొండపాలెం



ప్రభుత్వం సూక్ష్మపోషకాలపై రాయితీ నిలిపివేసింది. గత మూడేళ్లుగా ఇవ్వడం లేదు. ఏదైనా ప్రాంతంలో రైతులు కోరినట్లయితే వారికి అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో కావాల్సిన స్టాకు ఉంచుతాం. వాటిని పూర్తి ధరకే విక్రయిస్తారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అప్పుడు రాయతీపై సరఫరా చేస్తాం.

యువత సమగ్రాభివృద్ధే ధ్యేయం

- యూత్ క్లబ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు
- నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ అధికారి కమల్ సా

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



యువతీ, యువకులను అన్ని రంగాలలో సమగ్రాభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నెహ్రూ యువకేంద్ర(ఎన్‌వైకె) జిల్లా యువజన అధికారి కమల్‌సా తెలిపారు.యువజన క్లబ్‌ల ద్వారా పలు సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌వైకె క్యాలెండర్ ద్వారా వివిధ దినోత్సవాలు, యువజన ఉత్సవాలు నిర్వహించి యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తు న్నామన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వ ర్యంలో చేపట్టిన కార్యక్రమాలను కమల్‌సా ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

నెహ్రూ యువకేంద్ర కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2014 యూత్ పాలసీని అనుసరించి 15-29 సంవత్సరాల మధ్య ఉన్న యువతీ, యువకులకు వివిధ రంగాలలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. యువతకు నైపుణ్యాల అభివృద్ధిపై 3 నెలల శిక్షణా కార్యక్రమం సర్టిఫికెట్ కోర్స్ త్వరలో చేపట్టనున్నాం. నెలలో మొదటి బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

యూత్ క్లబ్స్ ఏర్పాటు

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా యువజన క్లబ్‌ల ఏర్పాటు చేశాం. మొత్తం 660 యూత్ క్లబ్స్ ఉన్నాయి. ఇందులో 100 క్లబ్స్ ఉత్సాహంగా పాల్గొం టున్నాయి. యూత్ క్లబ్స్ వివిధ సామాజిక అంశాలపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యూత్ క్లబ్‌లు చేపడుతున్న ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

యువజనోత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ

యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు కృషి జరుగుతోంది. ఒంగోలు ఎకెవికె జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ - యువ సంవాద్ ఇండియా 2047 నిర్వహించారు. ఈ సందర్భంగా 15 నుంచి 29 సంవత్సరాల లోపు యువతీ, యువకులకు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో పెయింటింగ్, కవితల పోటీలు, ఫొటోగ్రాఫ్, దేశభక్తితో జాతి నిర్మాణం అనే అంశంపై ఉపన్యాసపోటీలు, గ్రూప్ డ్యాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశాం.

ముఖ్య దినోత్సవాల నిర్వహణ

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వివిధ రకాల దినోత్సవాలు నిర్వహిస్తున్నాం. జనవరి నుంచి డిసెంబర్ వరకూ 25 ముఖ్య దినోత్సవాలను నిర్వహించి అందులో యువతీ, యువకులను భాగస్వాములు చేసి దేశ సమ గ్రత, సమైక్యత కోసం పాటు పడుతున్నాం.

భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిం చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. యువతలో నాయకత్వ లక్షణాలు, వ్యక్తి వికాసంపై శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో పారిశ్రామిక వేత్తలకు స్కిల్ బేస్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాంలో శిక్షణ ఇవ్వనున్నాం. యూత్ క్లబ్స్‌కి ట్రైనింగ్, స్పోర్ట్స్ కిట్స్ అందజేయనున్నాం. విలేజ్, క్లస్టర్ స్థాయి ఆటలు, క్రీడా పోటీలు, జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. మరిన్ని వివరాలకు ఎన్‌వైకె. ఎన్ఐసి.ఇన్, ఎన్‌వైకె.ప్రకాశం వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.